33865

# గులకరాళ్ళు

ప్రతీచీదేవి ఎర్రనిచీర ధరించింది. అరుణారుణమైన ముఖవర్చస్సుకు కాంతినిచ్చే కుంకుమబొట్టులాగ అస్త్రాద్రిని దినరాజు విశ్రమిస్తున్నాడు. పడమటి ముంగిలిలో మందారపూల తోరణాలు వ్రేలాడుతున్నాయి. పైనమాత్రం పచ్చని పసుపుముద్దలాగ ఆకాశం తెలిపోతోంది. పైన సూటిగావున్న ఆకాశమంతా— లోతుగా ఒడిదుడుకులులేని సముద్ర గర్భంలా— నిశ్చలంగా వుంది. ఉత్తరదిశలో మాత్రం చుట్టుచెంగావి మబ్బు తెరలు వ్రేలాడుతున్నాయి. చిక్కని జలతారంచుల మెరుపు మేఘాలు ఒయ్యారంగా నాట్యమాడుతున్నాయి. తోటలోని మావితోపులో దూరంగా దోబూచులాడుతున్న కోకిల బాకా వినిపిస్తోంది.

సన్నని ఇసుకలో కూర్చున్నారు వాళ్ళు. రామం గులకరాళ్ళు ఏరుతున్నాడు. సునాయాసంగా ఏరుతున్నాడు. జాగ్రత్తగా పరీక్షిస్తున్నాడు. "ఈరాయి ఎంత బావుందో చూడు!" అంటూ పక్కనే కూర్చున్న శచి కీయబోయాడు.

దీర్ఘంగా, తదేకధ్యానంతో మేఘాలను పరిశీలిస్తోంది శచి. చిరునవ్వు వెలిగిస్తూ, మునిపళ్ళతో పెదవి కొరుకుతోందామె. రివ్వుమని వీచుతున్న దక్షిణపవనా లామె ముంగురులతో ఆడుకుంటున్నాయి. "బావా! ఆ మబ్బు చూడరా! ఎంత బాగుందో! మొన్న తాత తెచ్చిన తాపితాలాగుంది గాదురా!" అంటూ ఎర్రి మబ్బుల్ని కళ్ళలో మెరిపిస్తోంది.

"అవునే— ఎంచక్క ఉంది!" అంటూ ఆకాశంలోకి దృష్టి సారించాడు. చేతిలోని గులకరాయి నలుపుతున్నాడు. "ఇదిగో ఇదిచూడు, ఏనుగులాగుంది కదే!...అబ్బ! అచ్చంగా ఏనుగే! తొండంకూడా వున్నట్టుందే అంటూ పారవశ్యమవుతున్నాడు. ఆకాశంలో ఏనుగును కనుగొన్నాననే సంబరంతో శచికేసి గర్వంగా చూశాడు. అతని ప్రజ్ఞను కన్నులతో బలపరిచిందామె. "అవునుగాని, ఈ రాయి చూశావా?" అంటూ గులకరాయి ఆమె చేతికిచ్చాడు. శచి ముఖంలో నవ్వులు వెల్లివిరుస్తున్నాయి. ఆమె కన్నులలో అరుణ జ్యోతులు కాంతివంతమవుతున్నాయి.

శచికి ఈమధ్యనే పదకొండో ఏడు వచ్చింది. అయినా వయసుకు తగ్గట్టుగా ఆమె ఎదగలేదు. సూటిగా చూసే కళ్లూ సూదిగా మొనదేరిన చిన్నిముక్కూ — శచి తెలివితేటల్నీ, చురుకునీ వ్యక్తం చేస్తున్నాయి. చురుకైన సూదిచూపుల్తో హఠాత్తుగా బావకేసి చూసిందామె. దానితో రామం వెంటనే నిశ్చేతనుడై ఏదో మాట్లాడుదామనుకున్నది— మింగేశాడు. వాళ్ళ ఈడూ జోడూ చూసినా, సన్నిహితంగావున్న పోలికల్ని చూసినా— వాళ్ళిద్దరూ మేనత్త మేనమామ బిడ్డలని నిశ్చయమౌతుంది. కంఠాల్నిబట్టేగాని, అందాల్నిబట్టిచూస్తే మాత్రం భేదం తెలియదు.

చాలా రోజుల్నుంచి వాళ్ళా ఇసుకలోనే కూర్చుంటున్నారు. పడమటి ఎర్రరంగుల్నీ, బరువుగా తిరిగే నీలిమబ్బుల్నీ చూస్తూంటే వాళ్ళకేదో సరదా పుట్టుకొస్తుంది. వాళ్ళదే ప్రదేశంలో కూర్చుని ఏవో కథలు చెప్పుకునో, వెర్రి వెర్రి ఆటలాడుకునో సాయంత్రం గడుపుతూ వుండేవారు. అప్పుడప్పుడు వాళ్ళు పరస్పరం చూసుకుని నవ్వుకునే అమాయకపు నవ్వులకు అర్థం వాళ్ళకు తెలియదు. అర్థంతో వాళ్ళకవసరమూ లేదు.

వయస్సులో రామమే రెండేళ్ళు పెద్దయినా, ప్రపంచ విషయాల అవగాహనలో మాత్రం శచికన్న చిన్నవాడే !

నిజానికి రామం మందబుద్ధి కాదుగాని, శచిలా అతితెలివి మాత్రం అతనికి లేదు. వాళ్ళిద్దరూ రోజూ ఎన్నో కబుర్లు చెప్పుకునేవారు. జటపటాలు వేసుకుని, ప్రతిరోజూ సాయంత్రి మయ్యేసరికి ఇంటికి చేరువగానేవున్న ఈ తోటలోకి వచ్చి ఇసుక దిబ్బమీద కూర్చోవడం అలవాటయిపోయింది వాళ్ళకి. ఇదివరకు ఇక్కడ కూర్చుని యిలాగ మబ్బుల్ని చూడ్డం అల వాటుందో లేదోగాని, శచి వచ్చిన నెలా పదిహేను రోజు ల్నుంచీ రామానికీదేపని. ఎర్రని పడమరను చూస్తూంటే— ఆ కన్నుల్లో రామాని కెన్నో రంగుల జ్యోతులు కనిపించేవి. ఎన్నెన్నో హారతులు తనకోసమే వెలిగినట్టుండేది.

మామూలుగానే— పొద్దువాలిపోతున్న సమయానికల్లా లేచి ఇంటికి వస్తున్నారు వాళ్ళు. అప్పుడు శచి అన్నది: 'ఒరే బావా— నువ్వు నాకంటె పొడుగుమూలాంచి— నాచేయి నీ భుజంమీద వేస్తే నడవలేకపోతున్నానురా!'' అని. ''అయితే పోనీలే, నేనే వేస్తాను'' అంటూ రామం శచి భుజంమీద చేయి వేశాడు. ఆమెను దగ్గరగా లాక్కుని హత్తుకున్నాడు. బుగ్గ మీద గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు! వెంటనే శచి దూరంగా జరుగుతూ —ఛీ— పో— కోతిపిల్లాడ్లా— చెబుతానంతే!'' అంది చిరుకోపం ప్రకటిస్తూ. అన్నదేగాని, వాడు చేసిన ఆ చేష్టతో ఆమెకు కూడా తీయని అనుభవమేదో కలగడం మూలాంచి కోపాన్ని మార్చేసి వెంటనే నవ్వేసింది.

* * *

ఆవేళ మొదలు బావంటే శచికీ, శచిమీద రామానికీ ఆప్యాయత మరీ పెరిగిపోయింది. శచి లేచీ లేవడంతోటే 'బావా' అంటూ రామం ప్రక్కలో కూర్చుని లేపుతూండేది. ఒకనాడు ముసలి ముత్తయిదు సుభద్రమ్మగారు, శచి రామం ప్రక్కమీద కూర్చుని వాడి జుత్తులోకి తన వేళ్ళుజొనుపుతూ గోముగా లేపుతూండగా, ఆమెని చూసింది. గబగబా లోపలికి వెళ్ళిపోయింది; పెరట్లో పాచిపని చేసుకుంటున్న కోడలు రాజ్యలక్ష్మి అత్తగారి కేకవినిపించి ఒక్క గెంతులో లోపలి కొచ్చేసింది. పళ్ళు తోముతున్న సత్యవతికూడా, పుల్ల అలాగేవుంచి 'ఏమిటమ్మా- అది!' అంటూ వచ్చింది. సుభద్రమ్మగారు, కూతుర్నీ, కోడల్నీ చెరో రెక్కా పట్టుకొని వీధి వడవలోకి చక్కా వచ్చింది. "చూడవే రాజ్యం! నా కొడుకు దాన్నెలా మురిపిస్తున్నాడో! చూడమ్మా సత్యం! నీకూతురికి వాడంటే ఎంత వొలపనుకున్నావ్! వాళ్ళిద్దరూ దంపతులైతే బాగుండున్రా!" అంటూ మనుమరాల్నిచూసి ముచ్చటపడుతోంది.

బామ్మ ముసిముసి నవ్వు వినగానే రామం ఉలిక్కిపడి లేచాడు. శచి సిగ్గుపడుతూ, బావ పక్కమీద బోర్లాపడుకుంది. చేతుల్తో కళ్ళు మూసుకుని వేళ్ళ సందులోంచి క్రీగంట చూస్తోంది. ఆ సమయంలో రామం పడుకున్న పక్క ఎంతో కమ్మగా వాసనేసిందామెకి.

"పోనీవే—అమ్మా! ఇప్పటినుంచీ అలా అనడమెందుకే! వాళ్ళనలా సరదాగా ఉండనిద్దూ!" అంటూ సత్యవతి ముఖం కడుక్కోడానికి పెరటిలోకి వెళ్ళిపోయింది. "నాకుమాత్రం సరదాకాదుటే!" అంటూ ముచ్చటగా నవ్వుతూన్న సుభద్రమ్మ మాటల్ని ఆమె వినిపించుకోనేలేదు. కాని రాజ్యలక్ష్మి మాత్రం పకపక నవ్వుతూ, ఎంతో ఆప్యాయంగా— "బాబూ లేవరా! శచీ— ముఖాలు కడుక్కోండమ్మా! చద్దన్నాలు పెడతాను" అంటూ తన పని చూసుకుందుకు వెళ్ళిపోయింది.

సత్యవతికి శచి తర్వాత ముగ్గురు పిల్లలు పుట్టారు గాని, పాపము దక్కలేదు. మూడోకాన్పు ఆడపిల్ల పుట్టింది. ఎంతో అందంగా ఉండేది. ఆఖరి కదికూడా ఎగిరిపోయింది. అంచాతనే సత్యవతి అప్పట్నించీ అట్టే సరదాగా, కలివిడిగా ఉండటం లేదు. తరచుగా విరక్తితో ఉంటుంది. పిల్ల పుట్టి, పోయి మూడేళ్ళయినా మళ్ళీ కడుపూ కాలూ లేదు. విశ్వనాథంగారెంతో ఉత్సాహంగా— మంచితనంతో తన కాలేజీ 'మేష్టరీ' ఉద్యోగం చేసుకుంటున్నా— తన భార్య సత్యవతి దుఃఖాన్ని చూస్తే మాత్రం కళ్ళనీళ్లు గ్రుక్కుకునేవాడు. వేసవికి కాలేజీ మూసేయగానే సత్యవతినీ పిల్లలనీ పుట్టింటికి పంపి, తను భూముల శిస్తు వసూలు చేసుకుందుకని విశ్వనాథం తమ స్వగ్రామం వెళ్ళారు. విశ్వనాథం తలచినట్టు సత్యవతికి పుట్టింటిలో కొంత దుఃఖోపశమనమైనా— తలపుకు వచ్చినపుడు గుండె బద్దలయ్యేట్టు ఏడుస్తూనే వుండేది.

ఆడపడుచు యెడల ఎంతో ప్రేమగానూ, ఆప్యాయంగానూ మసులుకొనేది రాజ్యలక్ష్మి. లక్ష్మీపతికూడా తన చెల్లెల్ని సంతోషపెట్టడానికే చూసేవాడు. అపీ యిపీ చెపుతూండేవాడు. కోర్టు కట్టియ్యడంవల్ల తన ప్లీడరీ ఉద్యోగానికి సెలవు దొరికింది. రామం తర్వాత, రాజ్యానికి ఇద్దరాడపిల్లలు తరువాత చంటిపిల్లాడు శంకరమున్నూ– మొత్తానికి లక్ష్మీపతి జీవితం మాత్రం సంతృప్తిగానే సాగిపోతోంది.

రోజూ ఇలాగే కూర్చుని సంతోషంతో నవ్వుకుంటూనే వున్నారు వాళ్ళు. అయినా ఒకనాడు అకస్మాత్తుగా వేసవి కాలమైపోతున్నట్టుగా తెలిసింది వాళ్ళకి. వాళ్ళింటిలో ఆవేళ మామిడిపళ్ళు లేకపోవడం వాళ్ళ అనుమానాన్ని బలపరచింది. పైగా తాతయ్య, రామ్మూర్తిగారు అన్నారు కూడాను "కాపులన్నీ అయిపోయాయి. తోటలో దింపవలసిన చెట్లూ లేవు అని. అంచాతనే వాళ్ళకి దృఢపడింది| వేసవి అయిపోతున్నట్టు. వాళ్ళనాన్న రామాన్ని తర్డుఫారంలో చేర్పిస్తానన్నాడు. దానితో వాడిలో వెర్రిసంతోషమేదో కలిగింది. తప్పితే అప్పుడింకేమీ తెలియలేదు. "నేనీయేడు సెకండు ఫారంలో చేరతాను బావా! నీవుకూడా మా ఊరు రాకూడదూ! అక్కడ మనమిద్దరం చదువుకుందాం. మీ ఊరికంటె మా ఊరెంత బాగుంటుందనుకున్నావు? ఏం?... రా బావా?...

వస్తావుగదూ?..." అంటూ చిరునవ్వుముఖంతో అడుగుతున్న శచి కళ్ళల్లో మెరుస్తున్న ప్రేమాభిమానాలను రామం గ్రహించకపోలేదు. "అలాగేగాని– శచీ ఈ రాయి యెంత బాగుందో చూడవే! మా తమ్ముడిలా నున్నగా ఉంది కాదు టే!"

"ఔను బావా! అయితే మీ శంకరానికి బొమ్మరాయి అని పేరెడదామా!" అంది శచి. రాయిని వేళ్ళతో మృదువుగా తిప్పుతోంది. సాలోచనగా కళ్లు తిప్పుతూ ఇలాఅంది. "మా ఆఖరి చెల్లెలెంత బాగుండేదనుకున్నావు బావా! పాకడం వచ్చేసునింక!" అంటున్న శచి కళ్ళలో సుళ్ళుతిరుగుతున్న నీటి బిందువుల్లో ఎర్రని రంగులు మెరిశాయి.

రామం ఎన్నో అందమైన గులకరాళ్ళను ఏరుతూనే వున్నాడు. దాచుకుందామనుకుంటాడు. కాని శచి కళ్లకేసి చూస్తూ అన్నీ మరచిపోతాడు. అంచాతనే ఒక్కొక్కటే దూరంగా విసిరేస్తూ వుంటాడు. ఎన్ని గులకరాళ్ళు రామం చేతిలోకి వచ్చాయని మురిసిపోతున్నా వెంటనే అవి ఇసుకపాలే అవుతున్నాయి. తను పాఠంలో చదువుకున్న సంగతి అప్పుడప్పుడు జ్ఞాపకం వచ్చేది; శచీదేవి ఇంద్రుని భార్య కదా! నాపేరు ఇంద్రుడనివుంటే ఎంత బాగుండును!" అనుకునేవాడు. కాని మరుక్షణంలోనే ఆ సంగతి మరచిపోయి, తన పేరు రామం అన్నదే బాగుందనుకునేవాడు.

ఆవేళ రామం ఏదో ఆలోచిస్తూ శచి దగ్గరగా జరిగాడు. శచి వాణ్ణి చూస్తూనే ఉంది. 'శచీ!' అన్నాడు. కాని వెంటనే ఏం చెప్పాలో— ఎందుకు పిలిచాడో మరచిపోయి బెంగతో పెదవులు బిగించాడు. శచిమాత్రం— 'బావా! అలా వున్నావేం?' అంటోంది. రామం తొడమీద తలానుచ్చుకుని పడుకుంది. చేత్తో రామం గడ్డాన్ని పట్టుకొంది. "మా వూరు రా బావా! వస్తావు కదూ" అంటూ వూపుతూ గారాంగా అడిగింది. రామం మాట్లాడలేదు. మాట్లాడే స్థితిలో లేడు. గులకరాయికేసి చూస్తున్నాడు.

* * *

ఇంతట్లోకే మరునాడు వచ్చేసింది. పోస్టుజవాను వచ్చి కేకవేశాడు. బావపుస్తకాలు సర్దుతున్న శచి గబగబ పరుగెత్తింది. కవరిచ్చిపోయాడు పోస్టుజవాను. "అమ్మాయీ నాన్నగారో లేవ్, ఉత్తరంరాశాడు" అంటూ ఒక గెంతులో లోపలికి దుమికింది. ఆమెకూడా రామం వెళ్ళాడు. సత్యవతి కవరుచింపింది. ఉత్తరం ఇంగ్లీషునఉంటంవల్ల 'అన్నయ్యా' అంటూ లక్ష్మీంపతిని పిలిచింది. వచ్చి చదవడం మొదలుపెట్టాడు లక్ష్మీంపతి. తనకేమీ అర్థంకాకపోయినా, శచి మామయ్య ముఖాన్నే చూస్తోంది. భాష అర్థంకాకపోయినా, భావం గ్రహిస్తున్నందువల్ల కాబోలు—రామంగుండెల్లో బండపుచ్చుకొని దంచుతున్నట్టయి, బెంగతో బరువెక్కుతోంది.

సత్యవతి, రాజ్యం, సుభద్రమ్మా ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. ఉత్తరం ముడిచేస్తూ— విశ్వనాథంబావ సత్యవతిని తీసుకురమ్మనమని వ్రాశాడు. నేను తీసుకు వెళ్ళాలిట. తనకి పేపర్లు దిద్దుకో నేపని అర్జంటైందట—అని ముక్తసరిగా ముగించాడు. శచి బుగ్గపట్టుకుని మృదువుగా నొక్కుతూ "నిన్ను తీసుకురమ్మని వ్రాయలేదే శచీ మీనాన్న! నువ్విక్కడే చదువుకుందువుగాని...ఏం?" అన్నాడు. శచి తమాషాగా చూస్తూ "అమ్మా అంటూ" నాజూకుగా దీర్ఘం తీసింది.

తనకిదివరకే తెలిసినట్టుగా రామం ముఖం ముడుచుకున్నాడు. కళ్ళు నీళ్ళు తరుగుతుండగా, ఎవరూ చూడకుండా తుడుచుకుంటూ చల్లగా పైకి జారుకున్నాడు. ఇదంతా శచి కనిపెడుతూనే వున్నాది. రామం సరాసరి తోటలోకిపోయాడు. ఎందుకో తెలియదు, నూతిగట్టుమీద కూర్చుని రామం వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. తోట దిగుడుబావిలోని నిశ్చలమైన నీటిలో చిన్ని చిన్ని రాళ్ళు విసురుతున్నాడు. నీళ్ళలో అప్రయత్నంగా పడుతున్న గులకరాళ్ళవల్ల బుడగలువస్తూ "గుల్కు గుల్కు" మని విచిత్రమైన శబ్దాలు పుడుతున్నాయి. సున్నలు చుడుతున్న కెరటాలు ఒకదానొకటి తరుముతూ పరిగెడుతున్నాయి. విశ్వనాథం మామయ్య వ్రాసిన ఉత్తరం ఇంతకన్న పెద్దరాయిలాగ తన మానస సరోవరాన్ని తాకింది.

హృదయం కలతబారింది. అంచాతనే కన్నీటి కెరటాలు విరామం లేకుండా పొంగుతున్నాయి మరి!

తోట మొదట్లో వుండగానే "రామం" అంటూ పిలిచింది శచి! కాని పరధ్యానంగా ఉన్న రామానికా పిలుపు వినిపించలేదు. ఒగుర్చుకుంటూ వచ్చేసింది. మామూలుగా కూర్చునే ఇసుక దిబ్బమీద రామం లేడు. అటూ ఇటూ చూసింది. ఇసుక దిబ్బకు తూర్పువెంపున పదిబారల దూరంలో వున్న దిగుడుబావి దగ్గర రామం కనిపించాడు. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ చడీచప్పుడూ లేకుండా వెనకాలే వెళ్ళింది. వెంటనే రామం కళ్ళు మూసింది. చేతులు పట్టుకుని ఆమెను రామం ముందుకు తీసుకుంటూండగా– "దొంగా– ఇక్కడున్నావా? ఎంత వెదికే ననుకున్నావు– నీకోసం!" అంటూ నవ్వింది. చేతుల కంటుకున్న నీళ్ళను చూసుకుంది. జవాబు లేకుండా నేలచూపులు చూస్తున్న, జేవురించిన రామం ముఖంచూసి ఉద్వేగ్తుగా విస్తుపోయింది. "అదేం బావా! ఎందుకు చెప్పవూ!... నేను చచ్చిపోయినట్టే!" అంది. రామం ముఖం ఎత్తి కళ్ళు తుడిచింది. రామం మాట్లాడలేదు. ఆ ఓదార్పుతో మరింత దుఃఖం పొంగి ఆపుకుందామన్నా ఆగక కన్నీళ్ళు పొంగుతున్నాయి. పెదాలు వణికిపోతున్నాయి. "చెప్పకపోతే– నేనేమో... ఊఁ... అంతేనమ్మా మరి... చెప్పవూ!" అంది శచి, తన ముఖం పక్కకు తిప్పుకుంటూ;

ఆమె కళ్ళల్లో ఎర్ర వెలుగులు లేవు. నీలిమేఘాలు దాగు న్నాయి. వర్షం కురిసేముందు మబ్బుల్లాగ శచి కళ్ళు కదులు తున్నాయి.

"శచీ! మీ వూరు వెళ్ళిపోతావా?... నన్ను మరచి పోతావా?" అన్నాడు రామం. దీనంగా ప్రార్థిస్తున్నట్టుగా; ఏడుపు ఎక్కిళ్ళు ఆపుకుంటూ మళ్ళీ అన్నాడు. "నన్ను మరచి పోకేం మరి!..." ఇంక మాట రాలేదు. పక్కడొక్కలు ఎగురుతూనే ఉన్నాయి.

"నువ్వుకూడా రా బావా! నిన్ను మరచిపోతానా అబ్బా!" అంటూ రామం చేయితీసి తన మెడచుట్టూ పెట్టుకుంది.

రామం చేయి బిగించాడు. రామం కళ్ళలోని నీళ్ళు శచి ముఖంమీద కూడా పడ్డాయి. ఇద్దరి కన్నీళ్ళూ ఏకమై మహా ప్రవాహమయ్యాయి. భయంకరమైన నిశ్శబ్దం వాళ్ళిద్దర్నీ క్షణకాలం బంధించింది.

♦ ♦ ♦

మరునాటి సాయంత్రం పడవమీద రాజమండ్రికి ప్రయాణమయ్యారు. సత్యవతీ, లక్ష్మీపతీ, శచిన్నీ, రాజ మండ్రిలో రైలెక్కి గుంటూరు వెళ్ళాలివాళ్ళు. దిగబెట్టడాని కని రేవుదాకా వచ్చాడు రామం. శచి వాడికేసి కారుతున్న

కన్నీళ్లతో మౌనంగా చూస్తోంది. అమ్మా వాళ్ళూ చూడకుండా తుడిచేసుకుంటోంది. రామం ఆపుకోలేక వెక్కి-వెక్కి-ఏడిచేస్తున్నాడు. తనచేతిలోవున్న తాతయ్య చేతిని గట్టిగా నొక్కేస్తున్నాడు. శచివింటూనేవుంది. లక్ష్మింపతి శచి కళ్ళకేసే కారుతూ కాలువనీటిలో కలుస్తున్న కన్నీళ్ళకేసేచూస్తూ—గట్టుమీద రామం ఏడుపు ఎలుగు వింటూనేవున్నాడు. ఆలోచిస్తున్నాడు. కారణం తెలియకపోలేదు. దిగివెళ్ళి—"బాబూ! మళ్ళీ రెండురోజుల్లో వచ్చేస్తా—ఏదైనా కొనుక్కో—ఇదిగో!" అంటూ రూపాయితీసియిచ్చాడు. రూపాయికోసం ఏడుస్తున్నాడా రామం? కనుకనే పుచ్చుకోకుండా అలాగే ఏడుస్తున్నాడు. ఇంక లక్ష్మింపతికి వాడి దుఃఖాన్ని తొలగించే మార్గమేదో తెలియదు. నాన్నగారూ—రామాన్ని యింటికి తీసుకెళ్ళండి. అంటూ పడవఎక్కాడు. శచి నీటిలోకి చూస్తూ కన్నీళ్ళు తుడుచుకొంటోంది. "అబ్బ! ఈ దిక్కుమాలిన పడవమీద ఎప్పటికి వెడతాం బాబూ!" అంటూ సత్యవతి ఆవలిస్తుంది. "దిగడతానమ్మ" అన్నారు గట్టుమీంచి రామయ్యగారు—మనుమడికేసి చూసి వాణ్ణి గుండెకుహత్తుకొని ఉత్తరీయంతో కన్నీళ్ళుతుడిచారు. పడవ సాగనారంభించింది. శచి వెక్కి-వెక్కి- బిగ్గరగా ఏడుస్తుంది. ఆమెని లక్ష్మింపతిదగ్గరగా తీసుకున్నాడు. పడవసాగుతోంది. రామం వెనక్కితిరిగి పడవకేసి చూస్తూ—తాతయ్యతో యింటిముఖంపట్టేడు.

రామం హైస్కూల్లో చేరాడు కాని శచిని మరిచి పోలేదు. ఇంచుమించుగా రోజూ సాయంత్రం తోటలోకి పోతూనే వుండేవాడు. అక్కడే కూర్చునేవాడు. ఎర్రని మబ్బుల్ని చూసినా, గులకరాళ్ళని చూసినా ఎందుకో కన్నీళ్లు కారుతూనే ఉండేవి. చేతులు మాత్రం గులకరాళ్ళ నేరుతూనే వుండేవి కాని వాటి అందచందాలిప్పుడు రామానికవసరంలేదు. ఎన్నోరకాల మబ్బులాకాశంమీద తిరుగుతుండేవి. వాటిని చూసి వర్ణించడానికిప్పుడు రామానికి తీరుబడిలేదు. చూసినా రామానికా అందాలు, రంగులూ కనిపించవు. మబ్బులన్నీ ఏడుస్తున్నట్లే—తోట సర్వమూ పిలుస్తున్నట్టే రామానికి తోచేది. శని ఆదివారాలు తప్పకుండా తోటలోకి వచ్చేవాడు. గులకరాళ్ళలో శచికిష్టమైన బొమ్మరాళ్ళ నేరుకునేవాడు. కాని మళ్ళీ...శచి...ఎప్పటికి వస్తుందో! ★

రచన 1948లో – ప్రచురణ 1–9–1953

శ్రీ పాలకోడేటి సూర్యప్రకాశరావుగారి "ప్రేమజ్యోతి"

రాజమండ్రి.